క్లుప్తంగా

నేడు రెండో వార్డులో వైఎస్సార్ సీపీ ప్రచారం

దర్శి: పట్టణంలోని రెండో వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రచారం జరుగుతుందని కార్యాలయం ప్రతినిధి సందిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కురిచేడు మండలం కురిచేడు గ్రామ పంచాయతీలో ప్రచారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందినీలు పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

జాబ్‌మేళా మంచి అవకాశం

గిద్దలూరు రూరల్: నిరుద్యోగులకు జాబ్‌మేళా మంచి అవకాశమని సాయిచైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీ సిటీ ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 121 మంది హాజరు కాగా అందులో 48 మందిని ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించారు. హెచ్‌ఆర్ ఎస్.రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీప్‌బోరు ప్రారంభం



డీప్‌బోరును ప్రారంభిస్తున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో 4 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన డీప్ బోర్‌ను మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. పట్టణంలో ప్రజలు నీటికి ఇబ్బంది పడకుండా డీప్‌బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికీ నీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుబానీ, ఏఈ ఆదినారాయణ, నాయకులు మౌలాలి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై ఆసక్తి చూపాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని స్థానిక ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సూరిబాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా వైద్యశాల ఆవరణలో సోమవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశాలలోని వైద్యులతో పాటు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ వైవీ సోమయ్య, డాక్టర్లు ఖాదరయ్య, మధుకిరణ్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేలు జరిగితేనే
ఓటేయమన్న దమ్మున్న నేత జగన్



జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, పక్కన తాటిపర్తి



సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మహిళలు బాగుంటేనే వారి కుటుంబం, రాష్ట్రం బాగుంటుందన్న సిద్ధాంతాన్ని నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతానికి మించి ప్రాధాన్యం కల్పించారని, గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాల్లో రాణించేందుకు తన క్యాబినేట్‌లో స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో జరిగిన 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని 4 విడతలుగా రుణ విముక్తులను చేశారని పేర్కొన్నారు. మహిళా సాధికారత మరింత మెరుగుపడి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలకు చెందిన పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

మేలు చేకూరితేనే ఓటేయండి..

తమ కుటుంబాలకు మేలు చేకూరితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండని జగనన్న ఎంతో ధైర్యంగా, మీపై ఉంచిన నమ్మకంతో అడుగుతున్నారని, ఆ విధంగా ఓటు అడిగిన నాయకుడిని గతంలో చూడలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను రుణ విముక్తులను చేసేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో ఉన్న 7.98 లక్షల మహిళా సంఘాల్లోని 78.94 లక్షల అక్కాచెల్లెమ్మలకు ఉన్న అప్పు రూ.25,571కోట్లు విడతలవారిగా మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు.

మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకున్న చంద్రబాబు

పచ్చనేత నారా చంద్రబాబునాయుడు మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని చంద్రశేఖర్ విమర్శించారు. 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో మహిళలతో పాటు రైతులు కూడా ఎంతో అన్యాయానికి గురయ్యారని, రైతులను రుణవిముక్తులను చేస్తానని చెప్పిన ఆ పెద్దమనిషి మరింతగా అప్పులు చేయించాడని చెప్పారు. పొదుపు సంఘాల మహిళలు అప్పులతో అల్లాడిపోతుంటే చూస్తూ ఉరుకున్నాడని, ఎన్నికల ముందు పచ్చ నాయకుడు చెప్పినట్లు అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీ చేయలేదన్నారు. 2019కి ముందు ఎన్నికలు సమీపిస్తుండటంతో పసుపు, కుంకుమ ఆశా చూపించాడని, అప్పటికే మోసపోయిన అక్కాచెల్లెమ్మలు ఎన్నికల్లో ఆయనను అడ్రస్ లేకుండా చేశారని చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు జిత్తులమారి చతుష్టయం మాయ మాటలు చెప్పేందుకు మీ ముందుకు వస్తున్నారని, వారితో మహిళలు జాగ్రత్తగా ఉండాలని తాటిపర్తి సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళా సంఘాల నాయకురాళ్లు క్షీరాభిషేకం చేశారు. మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యులు చేదూరి విజయభాస్కర్, జాన్‌పాల్, త్రిపురాంతకేశ్వర దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, వైస్ ఎంపీపీ ఆదిశేషు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, వైఎస్సార్ క్రాంతిపథం–డీఆర్‌డీపీ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏపీఎం పి.ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన తాటిపర్తి



జబీవుల్లాను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మండల సచివాలయాల కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యద్ జబీవుల్లాను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్న సమయంలో జబీవుల్లాకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో స్టంట్ వేయించుకొని ఇంటికి తిరిగి వచ్చారు. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ముందుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆ తర్వాత ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. జబీవుల్లాను పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, వెన్నా మోహన్‌రెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు



మాట్లాడుతున్న లోకేశ్వరరావు

దర్శి: నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి లోపాలపై చర్చిస్తున్నామని ఎలక్టోరల్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం సమావేశం జరిగింది. లోకేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 282 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తున్నామన్నారు. ఐదు మండలాలకు 35 సెక్టార్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రజలందరికి ఈవీఎంలు, వీవీ పాట్‌లు పని చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామని చెప్పారు. ఎస్సై శివన్నారాయణ, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కంభం: లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం తెల్లవారు జామున స్థానిక హైవే రోడ్డుపై జరిగింది. వివరాలు.. మార్కాపురం నుంచి గిద్దలూరు వెళ్తున్న ఓ లారీ స్థానిక హైవే రోడ్డుపై ఉన్న యూటర్న్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 9వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 10న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. 9వ తరగతిలో చేరే విద్యార్థులకు జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ మార్కాపురం, జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ మార్కాపురం, జెడ్పీహెచ్‌ఎస్ రాయవరంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయం, రాయవరం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేని వారు జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేషనల్ డీవార్మింగ్‌పై అవగాహన

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో నులిపురుగుల నివారణపై హెచ్‌ఎం మౌలాలీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నులిపురుగుల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లను వాడాలని, గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎం సూచించారు. ఈనెల 9వ తేదీన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తామని ఆశా వర్కర్ జె.విక్టోరియారాణి తెలిపారు.



శివప్రసాద్‌రెడ్డిని ట్రైసైకిల్ అడుగుతున్న బాధితుడు



ట్రైసైకిల్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చెప్పాడంటే..చేస్తాడంతే!

దర్శి: పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం నిర్వహించిన ప్రచారంలో దివ్యాంగులైన ఇట్లా చెంచుబాబు, నాగులూరి శ్రీనులు తాము వికలాంగులమని తమకు ట్రైసైకిళ్లు కావాలని కోరారు. వెంటనే స్పందించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హుటాహుటిన బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు తెప్పించి ఇద్దరికి రెండు సైకిళ్లు అందజేశారు. దీంతో కాలనీ వాసులు శివప్రసాద్‌రెడ్డి దాతృత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు శివప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు 'మన ఊరికి మన శివన్న'

కురిచేడు: మన ఊరికి మన శివన్న కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరుగుతుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు పాల్గొంటారని పేర్కొన్నారు. తొలుత హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట తూర్పు హరిజనవాడకు వెళ్లే దారికి రూ.5 లక్షల జెడ్పీ నిధులతో పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆ తర్వాత పడమర హరిజనవాడలో ప్రజలతో మాట్లాడతారని, క్రిస్టియన్ పాలెం లో 5 లక్షల రూపాయలు జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, రూ.15 లక్షలతో అంతర్గత పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన, వాల్మీకి బజార్‌లో రూ.10 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన, ఈరన్న స్వామి దేవాలయం వద్ద వాల్మీకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన ఈద్గా ప్లాట్‌ఫారం, ప్రహరీ పనులను ప్రారంభిస్తారు. మండలంలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కమిటీల అధ్యక్ష,కార్యదర్శులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి



గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

గుడ్లూరు: కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా లెప్రసి, టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో లెప్రసి, టీబీ రోగులకు సంబంధించిన రికార్డులను, మందుల రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఈ నెలలో బీసీజీ వ్యాక్సినేషన్ వేస్తామన్నారు. కార్యక్రమంపై అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వారి వివరాలు నమోదు చేసి వైద్యశాలకు పంపించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందజేయాలన్నారు. కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్,వైద్యాధికారిమారుతీరావుపాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలి



రామాయపట్నం పోర్టు వద్ద కర్లపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి, ఐవీ రెడ్డి

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణం వలన ఇళ్లు కోల్పోతున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని కర్లపాలెం గ్రామస్తులు తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్లపాలెం గ్రామస్తులు పోర్టు వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పోర్టులో జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మీరయ్య, రమణయ్య, శేషయ్య, గ్రామ కాపులు మాట్లాడుతూ కర్లపాలెం గ్రామస్తులకు పొలాలకు నష్టపరిహారం మాత్రమే అందించి ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ.రెడ్డిలు అక్కడకు చేరుకొని గ్రామస్తులుతో చర్చలు చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు నిర్మాణ పనులకు ఆటంకం కలిగించవద్దన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



ఏఎంసీ చైర్మన్ షంషేర్‌ను సన్మానిస్తున్న డీఎల్‌డీఓ సాయికుమార్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం: రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్‌ను జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మార్కాపురం ఏఎంసీ నూతన కమిటీ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు పీఎల్‌పీ యాదవ్, శారద రంగస్వామి గౌడ్‌ను సోమవారం యార్డు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, సాధన విద్యా సంస్థల డైరెక్టర్ జి.రమేష్‌బాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.


అంకితభావంతో పనిచేయాలి



మధుబాబు



రామకృష్ణ శివప్రసాద్



సాంబశివయ్య



ఎస్‌ఐ ఫిరోజ్ ఫాతిమా



ఎస్‌ఐ సైదులు



ఎస్సై మాధవరావు

కొనకనమిట్ల: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే ప్రజల మెప్పు పొందవచ్చని పొదిలి సీఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు. కొనకనమిట్ల ఎస్‌ఐగా బ్రహ్మనాయుడు బదిలీపై నాగులుప్పలపాడు వెళ్తున్న సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించారు.

కొనకనమిట్ల ఎస్సైగా కె.మాధవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కనిగిరి నుంచి బదిలీపై వచ్చారు. నూతన ఎస్సైని ఏఎస్‌ఐ గోపాలకృష్ణ, రైటర్ మురళీ, స్టేషన్ సిబ్బందితో పాటు మండలంలోని పలువురు నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

సీఐకి వైఎస్సార్ సీపీ నాయకుల సన్మానం

కొమరోలు: గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దాసరి ప్రసాద్‌ను, ఎస్సై వెంకట కోటేశ్వరరావులను వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. కొమరోలులోని పోలీసుస్టేషన్‌ను సోమవారం సందర్శించేందుకు వచ్చిన సీఐ దాసరి ప్రసాద్, ఎస్సై వెంకట కోటేశ్వరరావులకు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. వీరి వెంట వైఎస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, తిరుపతిరాజు, సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రమణరెడ్డి, సుభాని, వెంగయ్యచౌదరి, తిరుమలయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ సైదులు

పెద్దారవీడు: స్థానిక పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్‌ఐ గంగుల వెంకట సైదులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పొదిలి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ రాజ్‌కుమార్ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతకు ఎలాంటి ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుల్లలచెరువు ఎస్‌ఐగా ఫిరోజ్ ఫాతిమా

పుల్లలచెరువు: పుల్లలచెరువు నూతన ఎస్‌ఐగా ఫిరోజ్ ఫాతిమా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఒంగోలు నుంచి బదిలీపై పుల్లలచెరువు వచ్చానని, త్వరలో జరిగే ఎన్నికలకు మండల ప్రజలు పూర్తిగా సహకరించాలని ఆమె కోరారు. పలువురు ఎస్‌ఐని కలిసి అభినందనలు తెలిపారు.



సీఐ సమీముల్లా

విధుల్లో చేరిన తహసీల్దార్, ఎస్‌ఐ

త్రిపురాంతకం: స్థానిక తహసీల్దార్, ఎస్‌ఐగా బదిలీపై వచ్చిన అధికారులు నూతనంగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌గా రామకృష్ణ శివప్రసాద్, ఎస్‌ఐగా సాంబశివయ్యలు బాధ్యతలు చేపట్టారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు: నూతన తహసీల్దార్‌గా జె మధుబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ నయీం అహ్మద్ సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న జె.మధుబాబు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఓ

స్థానిక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా కె.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏపీఓ సస్పెండ్ కావడంతో తాళ్లూరు ఏపీఓ మురళి ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఏపీఓగా బాధ్యతలు నిర్వహించారు. నూతన ఏపీఓగా తర్లుపాడులో ఏపీఓగా పని చేస్తున్న నాగరాజు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.



సీఐ, ఎస్సైలను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎస్సై బ్రహ్మనాయుడును సన్మానిస్తున్న సీఐ, సిబ్బంది

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు నూతన తహసీల్దార్‌గా మహ్మద్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కేవీ ప్రసాద్ కనిగిరి ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా మాచర్ల నుంచి మహ్మద్ హుస్సేన్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

పుల్లలచెరువు తహసీల్దార్‌గా శ్రీనివాసులు

పుల్లలచెరువు: స్థానిక తహసీల్దార్‌గా టి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై పుల్లలచెరువు రావడం జరిగిందని ఆయన తెలిపారు.

దర్శి సీఐగా సమీముల్లా

దర్శి: పట్టణ సీఐగా సమీముల్లా సోమవారం విధులకు హాజరయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ జె. రామకోటయ్య బదిలీపై కంభం వెళ్లారు. సమీముల్లా గుంటూరు జిల్లా మాచర్లలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై దర్శి వచ్చారు.

పాఠశాల ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయాలి



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకోవడంతో వారికి నోటీసులు జారీ చేసి స్థలాన్ని ఖాళీ చేయించనున్నట్లు తహసీల్దార్ కెవిప్రసాద్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కేవీ ప్రసాద్ గ్రామానికి చేరుకొని ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులతో మాట్లాడారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తక్షణమే ఆక్రమణ పాఠశాల స్థలాన్ని ఖాళీ చేయాలని సూచించారు. లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాళీ చేసేందుకు మూడు రోజులు సమయం కావాలని కోరగా అందుకు సంబంధించి వారి నుంచి రాతపూర్వక హామీ తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, కమిటీ చైర్మన్ అమల, వీఆర్వో రమణారెడ్డి, మహిళా పోలీస్ త్రివేణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుర్గా సమేత భోగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో దుర్గా సమేత భోగేశ్వరస్వామి శివాలయంలో మూడో వార్షికోత్సవం సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు సోమవారం పూజలు చేశారు. అర్చకుడు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో శివలింగంకు గణపతి పూజ, అభిషేకాలు, చండీ హోమాలు తదితర పూజలు నిర్వహించిన అనంతరం శివలింగాన్ని పూలమాలతో అలంకరించారు. రాత్రి దుర్గా సమేత భోగేశ్వర స్వామి వారికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాంతికల్యాణం నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి శాంతికల్యాణం తిలకించారు. ఆలయం ప్రాంగణంలో చిన్నారులతో కోలాటం ప్రదర్శించారు.

నిత్యావసరాలు పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డు మానసిక వికలాంగుల పాఠశాలకు, కొంగలవీడురోడ్డు అమ్మ ఆశ్రమంలోని నిర్వాహకులకు సోమవారం ముక్కెర కాశిరెడ్డి ఆర్థిక సహాయం మేరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డి నిత్యావసరాలు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలనే మంచి మనస్సు ప్రతి ఒక్కరికి కలగాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు దుగ్గా రాజశేఖర్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, అమ్మ ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మ, వికలాంగుల పాఠశాల నిర్వాహకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.